# ప్రజల ప్రశ్నలతో బే'జారే'!

- రైతుల రుణమాఫీ, పెన్షన్ల పెంపుపై ఎమ్మెల్యేను ప్రశ్నించిన గ్రామస్తులు
- వారిని అడ్డుకుంటూ.. మైక్ ఇచ్చేందుకు నిరాకరించిన కాంగ్రెస్ కార్యకర్తలు
- పార్టీ కార్యకర్తలను సముదాయించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- మహ్మద్‌నగర్‌లో రసాభాసగా మారిన రచ్చబండ కార్యక్రమం



మహ్మద్‌నగర్ రచ్చబండ కార్యక్రమంలో సమస్యలపై ప్రశ్నిస్తున్న యువకులు, గ్రామస్తులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

చండ్రుగొండ, సెప్టెంబర్ 26 : పల్లెల్లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం చండ్రుగొండ మండలం మహ్మద్‌నగర్ గ్రామంలో చేపట్టిన రచ్చబండ కార్యక్రమం రసాభాసగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, తమ గ్రామంలో పేరుకుపోయిన సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని ప్రజలు ప్రశ్నిస్తుండగా.. వారికి మైక్ ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. గ్రామంలో అధికారుల సమక్షంలో రచ్చబండ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. తాను మీ గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నానని, ఏమైనా సమస్యలు ఉంటే చెబితే.. వాటిని పరిష్కరిస్తానని అన్నారు. వెంటనే గ్రామస్తులు కమాల్, లాల్ అహ్మద్, కరీంబీ, హుస్సేన్, బాద్‌షా, అజ్గర్, ఖాసీలు తమ గ్రామంలోని సమస్యల గురించి ఏకరువు పెట్టారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతుల రుణమాఫీ పూర్తిగా కాలేదని, పెన్షన్లను ఎప్పటి నుంచి పెంచి పంపిణీ చేస్తారని, మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఎప్పటి నుంచి ఇస్తారని వారు ప్రశ్నించారు. గ్రామంలో ఐదు నిమిషాలకోసారి కరెంటు పోతున్నదని, తాగునీరు సైతం సక్రమంగా సరఫరా చేయడం లేదని, కొత్త ఇళ్లు నిర్మించుకుంటే ఇంటి నెంబర్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్న వారిని అడ్డుకోవడంతోపాటు వారికి మైక్ కూడా ఇవ్వలేదు. ఎమ్మెల్యే కలుగజేసుకొని వారిని సముదాయించారు. కొందరు రైతులకు సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాలేదని, వారికి త్వరలోనే మాఫీ అవుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో అశోక్, ఏఈలు సాయికృష్ణ, శ్రీనివాసరావు, హరికృష్ణ, నరసింహారావు, ఏపీఎం సంతోశ్, నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మాలోత్ బోజ్యానాయక్, నల్లమోతు రమణ, తుమ్మలపల్లి సురేశ్, ధరావత్ రామారావు, కీసరి భద్రయ్య, ఇంజం అప్పారావు, బానోత్ రాముడు పాల్గొన్నారు.

## పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన మలేషియా బృందం



పామాయిల్ ఫ్యాక్టరీలో మలేషియాకు చెందిన వైకేఎల్ గ్రూప్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆయిల్‌ఫెడ్ అధికారులు

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 26 : మలేషియాకు చెందిన వైకేఎల్ గ్రూప్ ప్రతినిధి బృందం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని గురువారం సందర్శించి గెలల ప్రాసెసింగ్‌ను పరిశీలించింది. అయితే ప్రాసెసింగ్‌లో ఖాళీ గెలల ప్రెస్సింగ్‌లో అధునాతన టెక్నాలజీ గురించి వివరించినట్లు ఆయిల్‌ఫెడ్ పీ అండ్ పీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ కల్యాణ్‌లు తెలిపారు. కొత్త టెక్నాలజీతో కొంతమేర ఆయిల్ లాస్‌ను తగ్గించే అవకాశంతోపాటు పామాయిల్ పీచు ప్రస్తుతం వెలువడుతున్న దానికంటే ఇంకా చిన్నదిగా కత్తిరించి వస్తుందని వివరించారు. చిన్న పీచు బ్రాయిలర్‌లో ఉపయోగించడానికి మరింత అనువుగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

**'కేసీఆర్ కిట్' స్థానంలో**


**'మాతా, శిశు సంరక్షణ పథకం'**

**ఇందులో కిట్లను మాత్రమే**

**అందిస్తున్న కాంగ్రెస్ సర్కారు**

**5,263 మంది బాలింతలకు అందని ప్రోత్సాహకం**

# పేరు మార్చారు.. ప్రోత్సాహకం మరిచారు



కేసీఆర్ కిట్లను అందిస్తున్న వైద్యులు (ఫైల్)

అశ్వారావుపేట, సెప్టెంబర్ 26 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కేసీఆర్ కిట్ల పథకం' కాంగ్రెస్ ప్రభుత్వంలో సక్రమంగా అమలు కావడం లేదు. కేవలం బాలింతలకు ఆరోగ్య కిట్‌ను మాత్రమే అందిస్తున్నారు. నగదు ప్రోత్సాహకాన్ని ఇవ్వడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు గత కేసీఆర్ సర్కారులో కేసీఆర్ కిట్‌ను అందించేవారు. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు ఇది ఎంతగానో ఉపయోగపడేది. ఆ కిట్లతోపాటు నగదు ప్రోత్సాహకాన్ని కూడా బాలింతలకు అందించేవారు. గత జనవరి నుంచి భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 5,263 మంది గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించారు. వీరందరికీ నగదు ప్రోత్సాహం అందలేదు. గర్భిణుల ప్రసవంలో ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని నియంత్రించడంతోపాటు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కల్పించడానికి, మెరుగైన వైద్య సేవలు అందించడానికి గత కేసీఆర్ ప్రభుత్వం 2017 జూన్ నెలలో కేసీఆర్ కిట్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్య సంరక్షణ కోసం 16 రకాల వస్తువులతో కూడిన కిట్‌ను అప్పటి కేసీఆర్ సర్కారు అందించింది. అలాగే మగబిడ్డ జన్మిస్తే రూ.12 వేలు, ఆడబిడ్డ జన్మిస్తే రూ.13 వేల చొప్పున నగదు ప్రోత్సాహం కూడా మంజూరు చేసింది. కానీ.. తొమ్మిది నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్ కిట్ పథకాన్ని మాతా, శిశు సంరక్షణ పథకంగా మార్చింది. దాని ద్వారా కేవలం ఆరోగ్య వస్తువుల కిట్‌ను మాత్రమే అందిస్తోంది. కానీ.. ప్రోత్సాహక నగదును మాత్రం అందించడం లేదు. అయితే, ఈ ఏడాది జిల్లాలోని



కేసీఆర్ కిట్ ద్వారా అందించిన వస్తువులు (ఫైల్)

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన 5,263 మంది గర్భిణుల్లో కొందరికి మాత్రమే కిట్లు అందాయి. నగదు ప్రోత్సాహం ఎవరికీ అందలేదు.

### నాలుగు విడతల్లో నగదు ప్రోత్సాహం..

నగదు ప్రోత్సాహకాన్ని గత కేసీఆర్ సర్కారు నాలుగు విడతల్లో అందించింది. బిడ్డకు టీకాలు వేయించడంలో నిర్లక్ష్యంగా ఉండొద్దనే ఉద్దేశంతో నగదు ప్రోత్సాహకాన్ని విడతలవారీగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఆసుపత్రిలో గర్భిణిగా నమోదు చేసుకుని కనీసం రెండుసార్లు వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాత మొదటి విడతగా రూ.3 వేలు అందించేది. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన తర్వాత ఆడబిడ్డ పుడితే రూ.5 వేలు, మగ బిడ్డ పుడితే రూ.4 వేలతోపాటు రూ.2 వేల విలువ గల కేసీఆర్ కిట్‌ను రెండో విడతగా అందించేది. బిడ్డ పుట్టినప్పటి నుంచి మూడున్నర నెలల కాలంలో నిర్దేశిత టీకాలు తీసుకున్న తర్వాత మూడో విడతగా రూ.2 వేలను ఇచ్చేది. బిడ్డ పుట్టినప్పటి నుంచి 9 నెలల కాలంలో టీకాలు పూర్తిగా తీసుకున్న తర్వాత రూ.3 వేల చొప్పున నాలుగో విడత కింద నగదు ప్రోత్సాహకం అందించేది.

### ప్రోత్సాహకం మరిచిన కాంగ్రెస్ సర్కారు..

కేసీఆర్ కిట్ల పథకాన్ని మాతా, శిశు సంరక్షణగా మార్పు చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు.. బాలింతలకు కేవలం కిట్ మాత్రమే పంపిణీ చేస్తోంది. నగదు ప్రోత్సాహకాన్ని ఇవ్వడం లేదు. ఆ కిట్లు కూడా కొందరు బాలింతలకే అందుతున్నాయి. నగదు ప్రోత్సాహకం ఏ ఒక్కరికీ అందడం లేదు. జిల్లాలోని 47 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 5,263 మంది గర్భిణులు ప్రసవించారు. వీరంతా నగదు ప్రోత్సాహం కోసం ఎదురు చూస్తున్నారు.



### కిట్టు కూడా అందలేదు..

కొత్తగూడెం రామవరంలోని జిల్లా మాతా శిశు ఆరోగ్యం కేంద్రంలో గత ఏడాది ఆగస్టు 22న నేను మొదటి కాన్పులో బిడ్డకు జన్మనిచ్చాను. సుమారు ఏడాది కాలం దాటినా ఇప్పటి వరకు ఆరోగ్య సంరక్షణ కిట్టు గానీ, నగదు ప్రోత్సాహకం గానీ అందలేదు. ఆరోగ్య కిట్టుతోపాటు నగదు ప్రోత్సాహం కూడా వస్తుందేమోనని చూస్తున్నాను.

**–పద్దం స్వాతి, బాలింత, చండ్రుగొండ**

### ఎప్పటికప్పుడు బిల్లులు ప్రతిపాదిస్తున్నాం..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే బాలింతలకు నగదు ప్రోత్సాహకం కోసం బిల్లులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నాం. గర్భిణి ప్రసవించిన తర్వాత ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న మాతా, శిశు సంరక్షణ పథకం కిట్లు బాలింతలకు అందిస్తున్నాం. నిధుల విడుదల తర్వాత నగదు ప్రోత్సాహకం అందుతుంది.

**–డాక్టర్ రాందాస్, ప్రభుత్వ వైద్యుడు, అశ్వారావుపేట**

# పర్యాటక గుమ్మంగా 'ఖమ్మం'

- ఖిల్లాపై రోప్‌వే పనులను శరవేగంగా చేపట్టాలి
- పాలేరు, వైరా రిజర్వాయర్లలో బోటింగ్ రిక్రియేషన్
- పర్యాటక అభివృద్ధిపై సమీక్షలో మంత్రి తుమ్మల



టూరిజం కార్పొరేషన్ ఎండీతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాను పర్యాటక గుమ్మంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పేర్కొన్నారు. ఖమ్మం ఖిల్లాకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా దానిని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పర్యాటక అభివృద్ధిపై హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో గురువారం సమావేశం నిర్వహించిన ఆయన.. ఖమ్మం జిల్లాలో నిర్మించ తలపెట్టిన రోప్‌వే పనులపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎండీ ప్రకాశ్‌రెడ్డిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం ఖిల్లాపై రోప్‌వే పనులను శరవేగంగా చేపట్టాలని ఆదేశించారు. లోయర్ పాయింట్ నిర్మాణానికి లకారం చెరువు పరిసర ప్రాంతం అనువుగా ఉంటుందని అన్నారు. అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఖమ్మం ఖిల్లాను టూరిజం హబ్‌గా తీర్చుదిద్దాలని సూచించారు. రోప్‌వేతోపాటు అమ్యూజ్‌మెంట్ పార్కులు, హోటళ్లు నిర్మించాలని అన్నారు. వాటర్ ఫాల్స్, హోళ్ల నిర్మాణం రెండో దశలో చేపట్టాలని ఆదేశించారు. ఖమ్మం కలెక్టర్, కేఎంసీ కమిషనర్‌తో చర్చించి వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాద్రిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భద్రాద్రిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, వైజ్ఞానిక యాత్రలకు శ్రీకారం చుడతామని వివరించారు. నేలకొండపల్లి బౌద్ధస్తూపం, భక్తరామదాసు ధ్యాన మందిరం, కూసుమంచి శివాలయం టూరిజం సర్క్యూట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రోప్‌వే పనులకు సంబంధించి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ఆ రంగంలో పేరొందిన సంస్థలను సంప్రదించినట్లు చెప్పారు.

## 'వాటా' ఇవ్వకుంటే ఆందోళనలు

**డైరెక్టర్(పా)కు టీబీజీకేఎస్ నేతల వినతి**



డైరెక్టర్(పా)కు వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 26 : సింగరేణి సంస్థ సాధించిన నికర లాభాలు రూ.4,701 కోట్లలో 33 శాతం వాటా రూ.1,551 కోట్లు కార్మికులకు చెల్లించాలని, లేదంటే దశలవారీ ఆందోళనలు చేస్తామని టీబీజీకేఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ అన్నారు. ఈ మేరకు సింగరేణి డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ సంస్థ సాధించిన లాభాలు ప్రకటించిన తర్వాత అందులో నుంచే లాభాల వాటా ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థ వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకొని సంస్థ అభివృద్ధి కోసం అని కొన్ని నిధులను పక్కన పెట్టి.. మిగిలిన డబ్బుల్లో లాభాల వాటా ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీనివాస్, వసికర్ల కిరణ్, రాసూరు శంకర్, బూర్గుల రవికుమార్, కాగితపు విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తమిళ నాడు పర్యటనలో ఎంపీ వద్దిరాజు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, సెప్టెంబర్ 26: బీఆర్ఎస్‌కు చెందిన వెనుకబడిన కులాల ప్రముఖులైన 40 మంది ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం తమిళనాడులో పర్యటించారు. బీసీల సంక్షేమం, సమున్నతి కోసం తమిళనాడు అక్కడి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాల గురించి అధ్యయనం చేస్తున్నారు. ఈ బృందంతో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మండలి బీఆర్ఎస్ పక్ష నాయకుడు సిరికొండ మధుసూధనాచారి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జోగు రామన్న, శ్రీనివాస్‌గౌడ్ తదితర ప్రముఖులు ఉన్నారు. తమిళనాడులోని సంబంధిత అధికారులతో వీరు సమావేశమై చర్చించారు. అనంతరం, తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మకు బీఆర్ఎస్ నేతలు అక్కడే ఘనంగా నివాళులర్పించారు.

# వీరనారి స్మరణలో..

- ప్రజా పోరాటాలకు స్ఫూర్తినిచ్చిన యోధురాలు
- ఉమ్మడి జిల్లాలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి




మణుగూరులో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు



మధిరలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

దొరల పెత్తనాన్ని ఎదిరించి.. రజాకార్లను తరిమికొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భద్రాద్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఖమ్మంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మణుగూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, మధిరలో ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఇల్లెందులో భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఖమ్మంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితర ప్రముఖులు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి దారి చూపిన ఆమె వీరత్వాన్ని స్మరించుకున్నారు. కాగా, ఐలమ్మ ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

–నమస్తే నెట్‌వర్క్



ఖమ్మంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



భద్రాద్రి కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్



ఇల్లెందులో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు దిండిగాల



ఖమ్మంలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

# ఐసీడీఎస్

- పదోన్నతులు పొందినా పైరవీలతో దక్కని పోస్టింగ్‌లు
- ఆర్డర్లు వచ్చి 15 రోజులైనా మళ్లీ మార్చేందుకు ప్రయత్నాలు
- భద్రాద్రి జిల్లా నుంచి ఇద్దరు సీడీపీవోలకు పదోన్నతులు
- చివరికి భద్రాద్రి డీడబ్ల్యూవో ఎవరికి దక్కేనో?

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పదోన్నతుల వ్యవహారం పైరవీలతో పరేషాన్ చేస్తున్నది. పదోన్నతి పొందిన ఇద్దరు డీడబ్ల్యూవోలు పోస్టింగ్‌లు నచ్చకపోవడం.. ఆర్డర్లు వచ్చినా విధుల్లో చేరకపోవడంతో ఆ లొల్లి బజారునపడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, బూర్గంపాడు ఐసీడీఎస్‌లలో పనిచేస్తున్న ఇద్దరు సీడీపీవోలకు సీనియార్టీ ప్రాతిపదికన జిల్లా సంక్షేమ అధికారులుగా పదోన్నతి కల్పించారు. ఈ నెల 13న కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. ఒకరిని ఖమ్మం జిల్లాకు.. మరొకరిని హనుమకొండ జిల్లాకు కేటాయించారు. అయితే వారిద్దరూ విధుల్లో చేరకపోవడంతో మళ్లీ ఆర్డర్లు మార్చే పరిస్థితి వచ్చింది. దీంతో పదోన్నతి పొందిన అధికారులు హైదరాబాద్‌కే పరిమితమయ్యారు.

### పదోన్నతి పొందినా పోస్టింగ్‌లు ఆలస్యం

సీడీపీవో నుంచి డీడబ్ల్యూవోలుగా పదోన్నతి పొందిన ఆనందం వారికి లేకుండా పోయింది. ఖమ్మంలో జాయిన్ కావడానికి ఒకరు సుముఖత చూపించకపోవడం, హనుమకొండకు పదోన్నతిపై వచ్చిన మరో అధికారి అక్కడ జాయిన్ కావడానికి నిరాకరించడం.. దానికి ఆమెకు స్పౌజ్ కోటా ఉండడం వల్ల ఆర్డర్లు మార్చడానికి మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే ములుగు, ఖమ్మం జిల్లాల మంత్రుల జోక్యంతో అధికారులు ఏ మంత్రి మాట వినాలో.. లేదా నిబంధనలు పాటించాలో.. తెలియక సతమతమవుతున్నారు. పదోన్నతులు పొందే సమయంలో సైతం మంత్రుల జోక్యం వల్ల నిబంధనలను తుంగలో తొక్కారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. డీడీ పోస్టుల్లో ఏడీలను వేయడం, ఏడీ పోస్టుల్లో డీడీలను వేయడం, భార్యాభర్తలకు వెసులుబాటు ఉన్నప్పటికి వారిని పక్కన పెట్టి పైరవీలకే అధికారులు తలొగ్గినట్లు తెలుస్తోంది.

### ఆర్డర్లు వచ్చినా మళ్లీ కౌన్సిలింగ్

ఒకసారి ఆర్డర్లు వచ్చిన తర్వాత మళ్లీ రీ ఆర్డర్లు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ పైరవీల సంస్కృతికి అద్దం పడుతుంది. దీంతో పైరవీల పదోన్నతుల వ్యవహారం చిలికి చిలికి గాలివానలా మారింది. ఈ నెల 13న పదోన్నతుల ఆర్డర్లు ఇచ్చినా ఖమ్మం పోస్టింగ్ వ్యవహారంతోపాటు హనుమకొండలో



GOVERNMENT OF TELANGANA
DEPARTMENT FOR WOMEN, CHILDREN, DISABLED AND SENIOR CITIZENS (PROG.I)

ఐసీడీఎస్‌లో సీడీపీవోలకు పదోన్నతులు వచ్చిన ఆర్డర్ కాపీ

మరో అధికారి జాయిన్ కాకపోవడంతో మరోసారి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిసింది. రాత్రికి రాత్రి హైదరాబాద్‌లో పదోన్నతులు వచ్చిన అధికారులను పిలిచి కమిషనర్ కోరుకున్న చోటకు అవకాశం ఇచ్చినా చివరికి వారి చేతికి ఆర్డర్లు రాని పరిస్థితి నెలకొంది. దీంతో పదోన్నతుల వ్యవహారం మంత్రి టేబుల్ పైకి వెళ్లినట్లు తెలిసింది.

### భద్రాద్రి డీడబ్ల్యూవో ఎవరికి దక్కేనో?

భద్రాద్రి జిల్లా డీడబ్ల్యూవో పోస్టు గురించి మొదటి నుంచి ఎవరూ ప్రయత్నం చేయకపోయినప్పటికీ చివరి నిమిషంలో ఇద్దరూ అదే పోస్టుకు పోటీ పడుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఖమ్మం జిల్లా ప్రాంగణ అధికారి.. జిల్లా సంక్షేమ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. రెండోసారి జరిగిన కౌన్సిలింగ్‌లో ఇద్దరు అధికారులు భద్రాద్రి జిల్లానే కోరుకోవడంతో పదోన్నతుల ఫైల్ మంత్రి చేతికి వెళ్లింది. దీంతో మంత్రి ఎవరి వైపు మొగ్గు చూపుతారో అనేది వేచిచూడాల్సిందే.